
సాక్షి ఖమ్మం

శనివారం । 31 । మే । 2025



మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో నకిలీ, నిషేధిత పత్తి విత్తనాలు అమ్ముతుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. IIలో



విపత్తుల వేళ ప్రణాళికే కీలకం

ప్రకృతి విపత్తుల సమయాన ప్రణాళికతో పనిచేస్తే నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. IIలో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
34° / 25°

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఏసీబీ డీఎస్పీకి క్యాష్ రివార్డు



రివార్డు అందుకుంటున్న డీఎస్పీ రమేశ్

ఖమ్మంక్రైం: ఏసీబీ డీఎస్పీ రమేష్‌కు విధినిర్వహణలో అభినందనలు దక్కాయి. అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగులను అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఆయన ఉమ్మడి జిల్లాలో అత్యధిక కేసులు నమోదు చేశారు. ఈనేపథ్యాన హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో డీఎస్పీకి ఏసీబీ డీజీపీ విజయకుమార్ క్యాష్ రివార్డు అందజేసి అభినందించారు.

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ఐదో తరగతి(రెసిడెన్షియల్), ఒకటో తరగతి(డే స్కాలర్)లో ప్రవేశానికి వచ్చేనెల 2నుంచి 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఐదో తరగతిలో 131 మంది, ఒకటో తరగతిలో 128 మందికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కాగా, ఐదో తరగతిలో ప్రవేశానికి నాలుగో తరగతి మార్కుల జాబితా, ఒకటి తరగతిలోనైతే పుట్టినతేదీ ధ్రువపత్రం, రేషన్ కార్డు లేదా ఆధార్‌కార్డు జిరాక్స్, మీ సేవ ద్వారా జారీ చేసిన కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణపత్రాలను దరఖాస్తుకు జత చేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారని తెలిపారు.

ముగిసిన ఉపాధ్యాయుల భర్తీ ప్రక్రియ

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాద్రి జోన్ పరిధి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ పూర్తిచేశామని జోనల్ అధికారి స్వరూపరాణి తెలిపారు. ఖమ్మంలోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ కళాశాల(బాలికలు)లో నిర్వహించిన ఇంటర్వ్యూలకు దరఖాస్తు చేసుకున్న 1,165 మంది అభ్యర్థుల్లో 700 మంది హాజరయ్యారని వెల్లడించారు. విద్యార్హతలు, ప్రతిభ, డెమో ఆధారంగా తాత్కాలిక అధ్యాపకులు, ఉపాధ్యాయుల భర్తీ చేపట్టామని ఆమె ఓ ప్రకటనలో తెలిపారు.

కొనసాగుతున్న 'దోస్త్' ప్రవేశాలు

ఖమ్మం సహకారనగర్: డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) ద్వారా డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. మొదటి విడతలో భాగంగా సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 6వ తేదీలోగా కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. లేనిపక్షంలో వారు సీటు కోల్పోతారని పేర్కొన్నారు. ఇక రెండో విడత ప్రవేశాల కోసం జూన్ 9వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని దోస్త్ కోఆర్డినేటర్ ఎం.డీ.సలీంపాషా ఓ ప్రకటనలో వెల్లడించారు.

లబ్ధిదారులకు అండగా నిలుస్తాం..



లబ్ధిదారులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మధిర: ఇందిరా మహిళా డెయిరీ లబ్ధిదారులకు యంత్రాగగం అన్నివిధాలుగా సహకరిస్తుందని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. మధిర మండలం సిరిపురం, వంగవీడు గ్రామాల లబ్ధిదారులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పశుగ్రాసం ఆవశ్యకత, గేదెల ఎంపిక, అధిక పాల ఉత్పత్తికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. త్వరలో యూనిట్లు అందనున్నందున ఇప్పటి నుంచే పశుగ్రాసం సాగుపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే, అధిక పాల దిగుబడి వచ్చేలా మేలైన గేదెలను ఎంపిక చేసుకుని, పాలను ప్రభుత్వ కేంద్రాలకు సరఫరా చేయాలని తెలిపారు. ఆపై లబ్ధిదారుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఉమాకుమారి, గ్రామ దీపికలు పాల్గొన్నారు.

30 అడుగుల బ్రిడ్జి.. కింద చెత్త

- లారీ ఢీకొనడంతో కింద పడిన కారు
- ఆపై టన్నుల కొద్దీ ఇనుపచువ్వల కట్టలు
- క్షణాల్లో కిందకు దిగడంతో ఐదుగురికి తప్పిన ముప్పు





వంతెన పైనుండి కింద పడిన ఇనున చువ్వల లారీ

1



రెయిలింగ్‌ను ఢీకొని ఆగిన వ్యాన్

2



ప్రమాదంలో ధ్వంసమైన కారు (ఇన్‌సెట్) ప్రమాదం నుంచి బయటపడిన గీత, ఆమె పిల్లలు

ఇక్కడ మొదటి ఫొటోలో వేలాడుతున్న లారీలో టన్నుల కొద్ది 20 ఎం.ఎం. ఇనుప చువ్వల లోడ్ ఉంది. ఈ లారీ శుక్రవారం వైరా వైపు నుంచి తల్లాడ వైపునకు వెళ్తోంది. వైరా మండలం స్టేజీ పిన పాక వద్ద హైలెవల్ వంతెనపైకి చేరుకుంటుండగానే తల్లాడ వైపు నుంచి కొబ్బరి బొండాల లోడ్‌తో వైరా వైపు వస్తున్న డీసీఎం వ్యాన్‌ను అదుపు తప్పి అతివేగంగా ఢీకొట్టింది. అయితే, వ్యాన్ డ్రైవర్ అప్రమత్తతతో వంతెన రెయిలింగ్‌ను తాకి నదిలో పడకుండా (రెండో ఫొటో) ఆగిపోయింది.

కారును సైతం..

వ్యాన్‌ను ఢీకొట్టాక లారీ అంతే వేగంగా వెళ్లి ఏపీలోని విసన్నపేట మండలం తెల్దారుపల్లి నుండి వైరా మండలం రెబ్బవరం వస్తున్న కారును సైతం ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు వంతెన పైనుంచి సుమారు 30అడుగుల లోతులో వైరా నదిలో పడింది. అదృష్టవశాత్తు ఆ ప్రాంతంలో నీళ్లు లేకపోగా.. మున్సిపాలిటీ కార్మికులు డంప్ చేసిన చెత్త కుప్పలపై కారు పడడంతో అందులో ఉన్న మొగిలిశెట్టి కోటేశ్వరరావు కాలు విరిగింది. ఆయన కుమారుడు రాజశేఖర్, కోడలు గీత, మనవడు తేజస్, మనవరాలు జ్యోతి సురక్షితంగా బయటపడ్డారు.

క్షణాల్లోనే మరో ముప్పు

కోటేశ్వరరావు కుటుంబీకులు ప్రమాదం నుంచి తేరుకుని కిందకు దిగగానే.. అంతసేపు బ్రిడ్జి పైనుంచి వేలాడుతున్న లారీ కొద్దికొద్దిగా కిందకు జారుతూ కారు పక్కనే పడింది. ఈ సమయాన లారీలోని టన్నుల కొద్ది ఇనుప చువ్వల కట్టలు కారుపై పడడంతో గుర్తుపట్టలేనంత నుజ్జు నుజ్జయింది. అంతకు క్షణాల ముందే కోటేశ్వరరావు కుటుంబీకులు కిందకు దిగి కొంచెం దూరానికి చేరడంతో ఇదంతా కళ్లారా చూస్తూ తాము ఎంత ప్రమాదం నుంచి బయటపడ్డామో ఊహించుకుంటూ షాక్‌కు గురయ్యారు.

లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు

ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ఏపీలోని తిరువూరుకు చెందిన షేక్ మున్నా తీవ్ర గాయాలతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. దీంతో పోలీసులు ఆయనను బయటకు తీసి 108 వాహనంలో ఖమ్మంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో వైరా– తల్లాడ జాతీయ ప్రధాన రహదారిపై ఇరువైపులా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ఎస్సై పుష్పాల రామారావు ఆధ్వర్యాన సిబ్బంది చేరుకుని వంతెనపై ఆగిన డీసీఎం వ్యాన్‌ను జేసీబీతో పక్కకు తీయించి రాకపోకలు క్రమబద్ధీకరించారు. కాగా, ప్రమాదం నుంచి బయటపడిన గీత స్వగ్రామం రెబ్బవరం కాగా, అత్తగారిల్లయిన ఏపీలోని విసన్నపేట నుంచి వస్తుండగా ఈ ప్రమాదం జరగడం.. అంతా ముప్పు నుంచి బయటపడడంతో ఘటనాస్థలిలో పిల్లలతో కూర్చున్న ఆమె షాక్‌తో కనిపించింది.

– వైరారూరల్

జెండా ఆవిష్కరించనున్న డిప్యూటీ సీఎం

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వచ్చేనెల 2న జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈమేరకు జిల్లాల వారీగా జాతీయ జెండా ఆవిష్కరించనున్న అతిథుల జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో భాగంగా ఖమ్మంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జాతీయ జెండా ఆవిష్కరించనున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

ఖమ్మంక్రైం: రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. పరేడ్ మైదానాన్ని శుక్రవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. వాతావరణానికి అనుగుణంగా సౌకర్యాలు కల్పించడంతో పాటు వేదిక ఏర్పాటు, శకటాల ప్రదర్శనపై సూచనలు చేశారు. డీఆర్వో పద్మశ్రీ, ఆర్‌ఐ కామరాజు, తహసీల్దార్ సైదులు, ఆర్‌ఐ వహీద్ పాల్గొన్నారు.

ప్రత్యేకంగా పర్యాటక అభివృద్ధి

- ఎకో టూరిజంలో 'కనకగిరి'కి స్థానం
- భద్రాచలం, కిన్నెరసాని, పులిగుండాల అనుసంధానానికి ప్రణాళిక
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



పులిగుండాల వద్ద గుట్టపైకి వెళ్తున్న మంత్రి తుమ్మల, డీఎఫ్ఓ సిద్ధార్థ్ తదితరులు



వ్యూ పాయింట్ వద్ద మంత్రి తుమ్మల, రాయల, ఎమ్మెల్యే రాగమయి తదితరులు

పెనుబల్లి: జిల్లాలో అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నందున, ఈ రంగంలో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తద్వారా పర్యాటక రంగానికే కాక స్థానికులకు ఆదాయం పెరగనుందని చెప్పారు. పెనుబల్లి మండలం పులిగుండాల ప్రాజెక్టు వద్ద అటవీశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఎకో టూరిజం ప్రాజెక్టును కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో పాటు అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. బ్రహ్మళకుంట అటవీప్రాంత సమీపాన పులిగుండాల సాగునీటి ప్రాజెక్టు వద్ద రూ.20 లక్షలతో చేపట్టిన టూరిజం పనులను పరిశీలించాక, టూరిస్టుల కోసం బస్సును ప్రారంభించారు.

రాష్ట్రంలో మూడు ప్రాజెక్టులు

పులిగుండాల వద్ద సుమారు 30 వేల హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించిన అటవీ ప్రాంతాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎకోటూరిజం ప్రాజెక్టుగా గుర్తించి అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తోందని మంత్రి తుమ్మల వెల్లడించారు. రాష్ట్రంలోని వికారాబాద్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు జిల్లాలోని పులిగుండాల ప్రాజెక్టు వరకు కనకగిరి గుట్టల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. వీటన్నింట్లో పులిగుండాల ప్రాజెక్టును కీలకంగా గుర్తించి అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. సుమారు రూ.7 కోట్ల నిధులతో ఎకో టూరిజం పనులకు శ్రీకారం చుట్టామని వివరించారు. కాగా, పెనుబల్లి మండలంలో ఇటీవల పోడు పేరుతో అడవులు నరుకుతున్నట్లు తెలిసిందని.. ఇలాంటి వారిపైనే కాక నిర్లక్ష్యంగా వహించే సిబ్బందిపైనా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పులిగుండాల ప్రాజెక్టు పరిధిలో చిరుతపులి, ఎలుగుబంటి, తోడేలు వంటివే కాక 120 రకాల పక్షి జాతులు సంచరిస్తున్నందున పర్యాటకంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. పులిగుండాల ప్రాజెక్టు నుండి అటవీ మార్గం ద్వారా భద్రాచలం వరకు వెళ్లేలా రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు భద్రాచలం, కిన్నెరసాని, పులిగుండాల ప్రాజెక్టులను అనుసంధానానికి ప్రణాళికలు ఉన్నాయని చెప్పారు. ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ అటవీ, పర్యాటక శాఖల మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు సహకారంతో పులిగుండాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా అటవీ శాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు మట్టా దయానంద్‌తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితులకు బేఫికర్

- జిల్లా కేంద్రంలోనే చికిత్సకు ఏర్పాట్లు
- పెద్దాస్పత్రిలో సిద్ధమవుతున్న 20 పడకల వార్డు



కేన్సర్ సెంటర్‌కు ఎంపిక చేసిన వార్డులో జరుగుతున్న పనులు



ప్రత్యేక విభాగానికి ఏర్పాటుచేసిన బోర్డు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో కేన్సర్ బారిన పడిన పేదల ఇక్కట్లు తీరనున్నాయి. ప్రభుత్వ వైద్యం కోసం హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లకుండా జిల్లా కేంద్రంలోని చికిత్స అందుబాటులోకి రానుంది. కేన్సర్ సోకి చివరి దశలో ఉన్న వారికే ప్రస్తుతం చికిత్స అందుతోంది. ఇకపై కేన్సర్ నిర్ధారణ, కీమోథెరపీ, ఇతర చికిత్స కూడా అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లా ఆస్పత్రిలో వార్డు


కేన్సర్ బారిన పడిన కొందరికి కీమోతోపాటు రేడియేషన్ థెరపీ అవసరమవుతుంది. కానీ ప్రభుత్వ పరంగా ఆ సౌకర్యం లేకపోవడంతో హైదరాబాద్‌కి వెళ్లాల్సి వస్తోంది. నాన్ కమ్యూనబుల్ డిసీజ్ ప్రోగ్రామ్ ద్వారా కేన్సర్ బాధితులను గుర్తిస్తుండగా.. మహిళా ఆరోగ్య కార్యక్రమం ద్వారా బ్రెస్ట్, ఓరల్, సర్వైకల్ కేన్సర్ బాధితుల గుర్తింపు కొనసాగుతోంది. వీరిలో వ్యాధి ప్రారంభ దశలో ఉంటే జిల్లాలోనే చికిత్స అందిస్తుండగా, సీరియస్ కేసులకు ప్రత్యేకంగా వార్డు లేదు. దీంతో కీమో, రేడియేషన్ థెరపీ కోసం వారిని హైదరాబాద్ పంపిస్తున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కేన్సర్ బాధితులు పెరుగుతున్న నేపథ్యాన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మెడికల్ కళాశాలల అనుబంధ ఆస్పత్రుల్లో ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 20 పకడలతో కేన్సర్ వార్డు సిద్ధం చేస్తున్నారు. వచ్చే నెలాఖరు నాటికి ఈ వార్డును అందుబాటులోకి తీసుకొచ్చేలా ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు.

చివరి దశలో ఉంటే..

జిల్లాలో కేన్సర్ బారిన పడి చివరి దశలో ఉన్న వారికి పెద్దాస్పత్రిలోని పాలియేటివ్ సెంటర్‌లో చికిత్స అందిస్తున్నారు. ఈ సెంటర్‌లో కేవలం ఏడు పడకలే ఉన్నాయి. హైదరాబాద్‌లో చికిత్స చేయించినా ఫలితం లేక జీవిత చరమాంకానికి చేరిన వీరికి ఈ సెంటర్‌లో చికిత్స అందించడమే కాక ఇంకొందరికి మొబైల్ వాహనం ద్వారా మందులు ఇస్తున్నారు.ప్రభుత్వ నిర్ణయం ప్రకారం పెద్దాస్పత్రిలో 20 పడకలతో కూడిన కేన్సర్ సెంటర్ త్వరలోనే అందుబాటులోకి రానుంది. జిల్లాలో ప్రస్తుతం 3వేల మంది వరకు కేన్సర్ బాధితులు ఉన్నట్లు అంచనా. ఆస్పత్రిలో ప్రత్యేక వార్డుతో పాటు కీమో, రేడియేషన్ థెరపీ సేవలు మొదలైతే ప్రభుత్వ వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన ఇక్కట్లు తీరనున్నాయి.

విత్తన ఎంపికే కీలకం

- అనుమతి ఉన్న డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి
- భూమి పదునెక్కాక సాగు చేస్తే మేలు
- సమగ్ర యాజమాన్య పద్ధతులతో ఉత్తమ దిగుబడి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో డీఏఓ పుల్లయ్య, కేవీకే కోఆర్డినేటర్ రవికుమార్



రైతుల సందేహాలు నివృత్తి చేస్తున్న డీఏఓ పుల్లయ్య, పక్కన కేవీకే కోఆర్డినేటర్ రవికుమార్

సాక్షి ఫోన్ ఇన్

ఖమ్మంవ్యవసాయం: 'పంటకు విత్తే మూలం.. సరైన విత్తనాలు ఎంచుకుని సమగ్ర విధానాలను అవలంబిస్తే ఆశాజనకమైన దిగుబడులు వస్తాయి..' అని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య, వైరా కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. 'సాక్షి' ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన ఫోన్ ఇన్‌లో జిల్లా నలుమూలల నుంచి రైతులు సాగుకు అనువైన విత్తనాలు, అందుబాటులో ఉన్న రకాల వివరాలే కాక సాగు విధానాలు, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అడిగిన ప్రశ్నలకు వారు సమాధానాలు ఇచ్చారు. ప్రభుత్వ ధ్రువీకరణ పొందిన కంపెనీలు, ఏజెన్సీలు, సంస్థలకు చెందిన విత్తనాలే కొనుగోలు చేయాలని సూచించిన అధికారులు పంట కాలం పూర్తయ్యే వరకు రశీదులు భద్రపర్చుకోవాలని తెలిపారు. ఈమేరకు రైతులు అడిగిన ప్రశ్నలకు అధికారులు ఇచ్చిన సమాధానాలు ఇలా ఉన్నాయి.

➡ **ప్రశ్న : ప్రస్తుత వర్షాలకు వరి నార్లు పోసుకోవచ్చా? ఏ రకం విత్తనాలు మేలు?**

– గరిదేపల్లి రామారావు, సుర్దేపల్లి

జవాబు : జూన్ మొదటి వారం తర్వాత వరినార్లు పోసుకోవచ్చు. ప్రభుత్వం అనుమతించిన సన్న రకాలను విత్తుకుంటే మద్దతు ధరతో పాటు బోనస్ వస్తుంది.

➡ **ప్ర : పచ్చిరొట్ట విత్తన ధరలు గత ఏడాదితో పోలిస్తే పెంచారు.**

– అయినాల కనకరత్నం, కేజీపురం, మల్లేశ్వరరావు, భీమవరం

జ : విత్తనోత్పత్తి తగ్గడంతో కొంత మేర ధర పెరిగింది. ప్రభుత్వ సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

➡ **ప్ర : యూరియాకు సబ్సిడీ ఎక్కువగా ఉండడంతో ఎక్కువగా వినియోగించాల్సి వస్తుంది. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులకు సైతం మరింత సబ్సిడీ ఇచ్చే ఆలోచన ఉందా?**

– షేక్ లాల్ మహ్మద్, ఖానాపురం

జ : యూరియా వాడకం తగ్గించేలా రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం. కాంప్లెక్స్ ఎరువుల్లోనూ యూరియా పాళ్లు ఉంటాయి. ఫార్మర్ ఐడీ విధానం అమలైతే భూమి ఆధారంగా కోటా నిర్ధారించే అవకాశం ఉంది.

➡ **ప్ర : పెసర ఎప్పుడు, ఏ రకాలు విత్తుకోవచ్చు?**

– ఏటుకూరి రవి, నాగులవంచ, జంగా రవీందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డిపాలెం

జ : ఇప్పుడు దుక్కులు సిద్ధం చేసుకుని 60 మి.మీ.ల వర్షపాతం నమోదయ్యాక జూన్ మొదటి వారం నుంచి పెసర విత్తుకోవచ్చు. ఎంజీజీ రకాలు అందుబాటులోకి వచ్చాయి.

➡ **ప్ర: పంటల సాగుపై మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారా?**

– శ్రీనివాసరెడ్డి, రామానుజపురం

జ : రైతుల్లో అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. లైసెన్స్‌డ్ డీలర్ల నుంచి విత్తనాలు కొనుగోలు చేస్తే నకిలీల బెడద ఉండదు.

➡ **ప్ర : వరిలో కేఎన్ఎం 7715 రకం అందుబాటులోకి వస్తాయా? – ఏలూరి వెంకట్రావు, కొక్కిరేణి**

జ : ఈ విత్తనాలను వ్యవసాయ విశ్వ విద్యాలయం ఇంకా రిలీజ్ చేయలేదు.

➡ **ప్ర: ఆయిల్‌పామ్‌లో మొక్కజొన్నను అంతర పంటగా వేసుకోవచ్చా?**

– కన్నెబోయిన రామకృష్ణయాదవ్, బస్వాపురం

జ : 19 నెలల వయసు ఉన్న తోటలో అంతర పంటగా మొక్కజొన్న కంటే కూరగాయలు, పెసర, మినుము సాగు మేలు. దుక్కి ఎక్కువగా దున్నకూడదు. అలా చేస్తే ఆయిల్ పామ్ వేరు వ్యవస్థ దెబ్బతింటుంది. యాసంగి పంటగా మాత్రం మొక్కజొన్నకు అవకాశముంది.

➡ **ప్ర : మెట్ట వరి సాగులో అధిక దిగుబడి ఇచ్చే రకాలు ఏవీ? – వరదా సైదులు, కొక్కిరేణి**

జ : మెట్టలో వరి సాగు చేస్తే అంతగా దిగుబడులు రాకపోగా సమస్యలు ఉత్పన్నమవుతాయి. కలుపు, తెగుళ్ల సమస్యలు ఉంటాయి. అలాగే, ఆరుతడి వరి సాగులో ఆశించిన ప్రయోజనాలు ఉండవు.

➡ **ప్ర : పచ్చిరొట్ట విత్తనాలు పక్కదారి పట్టకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

– శీలం సత్యనారాయణ రెడ్డి, ఎర్రుపాలెం

జ : రైతుల కోసం అందుబాటులో ఉంచే పచ్చిరొట్ట విత్తనాలు పక్కదారి పడితే సహించేది లేదు. ఎవరైనా సరైన బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. తీసుకున్న విత్తనాలపై అవసరమైన ప్రాంతాల్లో క్రాప్ బుకింగ్ చేయిస్తాం.

➡ **ప్ర : ఈ వర్షాలతో పత్తి సాగు చేయొచ్చా? పెసలు ఎప్పుడు వేసుకోవచ్చు?**

– చాంద్‌పాషా, ముష్టికుంట్ల, సైదారావు, తనికెళ్ల, డి.తిరుపతిరావు, రాజులదేవరపాడు

జ : ఈ ఏడాది రోహిణి కార్తెలోనే వానలు కురుస్తున్నాయి. నేలలో పదును ఆధారంగా జూన్ 10 తర్వాత పత్తి విత్తనాలు విత్తుకోవచ్చు. పెసర కూడా జూన్ రెండో వారం నుంచి విత్తుకోవచ్చు. పెసరలో ఎంజీజీ రకాలు, వరంగల్ రకాలు అనుకూలం.

➡ **ప్ర: ప్రస్తుత వర్షాలకు మెట్ట పైరుగా పత్తి సహా ఏయే పంటలు వేసుకోవచ్చు?**

– శ్యాంసుందర్ రెడ్డి, గైగోళ్లపల్లి

జ : ఈ వర్షాలకు నేల రకాల ఆధారంగా మెట్ట పంటలుగా పత్తి, పెసర సాగు చేసుకోవచ్చు. ప్రస్తుతం పత్తి వేసిన నేలలో యాసంగి పంటగా మొక్కజొన్న వేసుకునే అవకాశముంది.

➡ **ప్ర : విత్తనాలు నకిలీవా, మంచివా ఎలా గుర్తించాలి?**

– భూక్యా రాంబాబు, చంద్రశేఖర్, సింగరేణి మండలం

జ: లైసెన్స్‌డ్ దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయడమే కాక అన్ని వివరాలతో రశీదు తీసుకోవాలి. అపరిచిత వ్యక్తులు మాయమాటలతో అమ్మే విత్తనాలు నకిలీవని భావించాలి.

➡ **ప్ర : వరిలో 1224 రకాన్ని సాగు చేస్తే విక్రయానికి ఇబ్బంది పడ్డాం. ఇప్పుడేం చేయాలి?**

– పోతురాజు నర్సింహారావు, తుమ్మలపల్లి

జ : 1224 కాకుండా ఇతర సన్న రకాల సాగు మంచిది. ఎంటీయూ 1010 వంటి అనేక రకాలు ఉన్నాయి.

➡ **ప్ర : ఎరువులు పాత నిల్వలు ఇస్తుండడంతో గడ్డలుగా ఉంటున్నాయి. వరిలో సన్న రకాల విత్తనాలు లభ్యం కావడం లేదు.**

– సంద్యాల మాధవరావు, తిమ్మినేనిపాలెం

జ : ఎరువుల నిల్వలు అయిపోయాయి. ఇకపై గడ్డ కట్టిన ఎరువుల సరఫరా ఉండదు. రేక్ పాయింట్ కూడా మారింది. వరిలో సన్న బీపీటీ 5204 సాంబమసూరితో పాటు పలు సన్న రకాలు అందుబాటులోకి వచ్చాయి.

క్లుప్తంగా

ముగిసిన ఎన్‌సీసీ శిక్షణా శిబిరం



అధికారులకు జ్ఞాపిక ఇస్తున్న కరస్పాండెంట్ డాక్టర్ భూమేష్

వైరా: వైరా శాంతినగర్‌లోని న్యూ లిటిల్ ఫ్లవర్స్ పాఠశాలలో పది రోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఎన్‌సీసీ ఆఫీసర్లు కల్నల్ ఎస్.కే.భద్ర, కల్నల్ నవీన్ యాదవ్ నేతృత్వాన కేడెట్లకు దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాల పెంపు, శారీరక ధృడత్వం తదితర అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. ఈ సందర్భంగా చివరిరోజు భద్ర, నవీన్‌యాదవ్ మాట్లాడుతూ దేశ రక్షణలో సైన్యం పాత్రపై అవగాహన కల్పించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన కేడెట్లకు బహుమతులు అందించగా, అధికారులకు న్యూలిటిల్ ఫ్లవర్స్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్ జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఆఫీసర్ సీహెచ్.అపురూపాదేవి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ



డీఈఓను సన్మానిస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా డీఈఓ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యాశాఖ ఆధ్వర్యాన 15 రోజులుగా మూడు దశల్లో శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఈ మేరకు డీఈఓ, రిసోర్స్ పర్సన్లను పలువురు సన్మానించారు. ఏఎంఓ రవికుమార్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



సత్తుపల్లి : ప్రాసెసింగ్ యూనిట్‌లో పరిశీలిస్తున్న డీఏఓ, అధికారులు

సత్తుపల్లి/వేంసూరు: పంటల సీజన్ మొదలైన నేపథ్యాన ఎవరైనా అనుమతి లేని, నకిలీ విత్తనాలు అమ్మితే కఠినంగా వ్యవహరిస్తామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి డి.పుల్లయ్య హెచ్చరించారు. సత్తుపల్లి పట్టణంతో పాటు వేంసూరు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన విత్తనాల షాపుల్లో తనిఖీ చేశారు. షాప్‌లు, ప్రాసెసింగ్ యూనిట్లు, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలను పోలీస్ అధికారులతో కలిసి తనిఖీ చేయగా డీఏఓ మాట్లాడారు. నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసం చేయాలని ప్రయత్నిస్తే చర్యలు తప్పవని తెలిపారు. రైతులు కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. తనిఖీల్లో ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏఓలు శ్రీనివాసరావు, రామ్మోహన్, ఏస్సైలు రఘు, అశోక్, ఏఈఓలు కావ్య, నవ్య, రీమా, స్వాతి, అక్షర తదితరులు పాల్గొన్నారు.

గంజాయి చాక్లెట్లు అమ్ముతున్న ముగ్గురి అరెస్ట్

ముదిగొండ: ముదిగొండలోని పారిశ్రామిక ప్రాంతంలో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ ఓ.మురళి తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఉమేష్‌కుమార్, రింకూ కుమార్ ముదిగొండ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. ఇటీవల వారు స్వగ్రామం నుండి గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి పలువురికి అమ్ముతున్నట్లు తెలిసింది. ఈక్రమంలోనే శుక్రవారం గుమ్మడిద సత్యనారాయణ కిరాణా షాపు వద్ద అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా 280 గంజాయి చాక్లెట్లు లభించాయి. దీంతో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

12 మంది మైనర్లకు జరిమానా

ఖమ్మంక్రైం: వాహనాలు నడిపిన 12మంది మైనర్లకు రూ.200 చొప్పున జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించిందని ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల ఖమ్మంలో చేపట్టిన తనిఖీల్లో వాహనాలు నడుపుతూ పట్టుబడిన మైనర్లపై కేసు నమోదు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచామని పేర్కొన్నారు. దీంతో వారికి జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బి.రజని తీర్పు చెప్పారని వెల్లడించారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, తల్లిదండ్రులెవరూ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

మార్కెట్‌లోకి నకిలీ పత్తి విత్తనాలు

- ఏపీలో తయారీ.. జిల్లాకు తీసుకొచ్చి విక్రయం
- ఏన్కూరు, మధిరలో భారీగా నకిలీ, నిషేధిత విత్తనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ సునీల్‌దత్



నకిలీ విత్తనాల వివరాలు వెల్లడిస్తున్న సీపీ సునీల్‌దత్

ఏన్కూరు: కుటీర పరిశ్రమ మాదిరి ఇళ్లలోనే నకిలీ పత్తి విత్తన తయారుచేస్తూ విక్రయిస్తున్న పలువురిని జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మూడు ఘటనల్లో రూ.లక్షల విలువైన పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకోగా పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వివరాలను ఏన్కూరు పోలీసుస్టేషన్‌లో శుక్రవారం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ వెల్లడించారు. ఏన్కూరుకు చెందిన గాజుల నరసింహారావు అనుమతి లేని పత్తి విత్తనాలు అమ్ముతున్నాడనే సమాచారంతో ఈనెల 28న తనిఖీలు చేపట్టారు. ఆయనను విచారించగా ఏపీలోని మైలవరం మండలం చంద్రుగూడెంకు చెందిన శాలివాహన ఇంటి వద్ద పత్తి విత్తనాలు తయారు చేస్తున్నట్లు తేలింది. సదరు వ్యక్తి కర్ణాటక నుంచి విత్తనాలు తీసుకొచ్చి రైబోజోల్ మిశ్రమాన్ని కలిపి నరసింహారావుకు పంపుతున్నాడని, ఆపై ఏజెంట్లకు లాభాల ఆశ చూపి కలుపు, తెగుళ్లను తట్టుకుంటాయని నమ్మబలుకుతూ ప్యాకెట్ రూ.1,200 చొప్పున అమ్ముతున్నట్లు గుర్తించారు. శాలివాహన ఇంటి వద్ద క్వింటా రైబోజోల్ మిశ్రమం కలిపిన ప్యాక్ చేయని పత్తి విత్తనాలు, 450 గ్రాముల బరువు కలిగిన అరుణోదయ లేబుల్‌తో ఉన్న 272 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.

ఇవి కూడా ఏపీ నుంచే...

ఏన్కూరు మండలం రేపల్లెవాడలోని వెనిగండ్ల శ్రీహరిరావు వ్యవసాయ భూమిలో 210 ప్యాకెట్ల నకిలీ పత్తి విత్తనాలు లభించాయి. ఆపై శ్రీహరిరావు అనుచరుడు ఇమ్మనేని కిషోర్ ఇంట్లో తనిఖీ చేస్తే 120 కేజీల పత్తి విత్తనాలను గుర్తించారు. శ్రీహరిరావు ఏపీలోని తన బంధువు లక్ష్మీనారాయణ ద్వారా కేజీ రూ.800 చొప్పున నకిలీ విత్తనాలు తీసుకొచ్చి రూ.2,600 చొప్పున అమ్ముతుండడంతో శ్రీహరిరావు, కిషోర్‌తో పాటు ఏపీకి చెందిన అన్నెం లక్ష్మీనారాయణ, సిబ్బంది గుగులోత్ గోపీ, వరద బోయిన రమేష్, తంబళ్ల నవీన్, దొంతబోయిన రమేష్‌ను అరెస్టు చేసి 330 కేజీల నకిలీ పత్తి విత్తనాలు, ప్యాకింగ్, వేయింగ్ మిషన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇక ఏన్కూరుకు చెందిన పోలేటి కోటేశ్వరరావు ఇంట్లో తనిఖీ చేపట్టగా 20 నకిలీ పత్తి విత్తన ప్యాకెట్లు లభించాయి. ఆయన ఏపీలోని తెనాలి నుంచి అనుమతి లేకుండా విత్తనాలు తీసుకొచ్చి అమ్ముతున్నట్లు గుర్తించారు. ఈ మేరకు కోటేశ్వరరావుతో పాటు ఆయనకు విత్తనాలు సరఫరా చేస్తున్న ఏపీలోని బాపట్ల జిల్లా ఇంకొల్లుకు చెందిన వెనిగండ్ల రవిని అరెస్టు చేసినట్లు సీపీ వెల్లడించారు. ఈ సమావేశంలో కల్లూరు ఏసీపీ రఘు, కల్లూరు రూరల్ సీఐ ముత్తులింగం, ఎస్సైలు షేక్ రఫీ, హరిత పాల్గొన్నారు.

మధిర మున్సిపాలిటీ పరిధిలో...

మధిర: మున్సిపాలిటీ పరిధి మడుపల్లిలో ప్రభుత్వం నిషేధించిన బీజీ–3 పత్తి విత్తనాలు ప్యాకెట్లను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన పారా రామస్వామి ఓ ఫెర్టిలైజర్స్ కంపెనీలో పని చేస్తుండగా ఆయన ఇంట్లో నిషేధిత పత్తి విత్తనాలు, పురుగు మందులు ఉన్నాయనే సమాచారంతో మధిర టౌన్ సీఐ రమేష్, వ్యవసాయ అధికారి సాయిదీక్షిత్, ఎస్‌ఐ లక్ష్మీభార్గవి ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. ఈమేరకు బీజీ–3 అరుణోదయ పత్తి విత్తనాల ప్యాకెట్లు మూడు, అనుమతి లేకుండా విక్రయిస్తున్న రూ.65 వేల విలువైన పురుగు మందులు లభ్యమయ్యాయి. ఆయన నిదానపురంలో చెందిన బాధ పాపిరెడ్డి వద్ద విత్తనాలు కొనుగోలు చేసినట్లు చెప్పగా విచారణలో ఏపీలోని మైలవరం మండలం గంగినేనికి చెందిన నరేష్ వద్ద తీసుకొచ్చినట్లు వెల్లడించాడు. ఈమేరకు బాధ్యులను అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

విపత్తు వేళ ప్రణాళికే కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన అధికారులు

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం సహకారనగర్: ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పుడు ప్రణాళికాయుతంగా పనిచేస్తే ప్రజల ప్రాణాలతో విలువైన ఆస్తులు నష్టపోకుండా కాపాడొచ్చని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన వివిధ శాఖల అధికారులతో పాటు 'ఆపద మిత్ర'లుగా ఎంపిక చేసిన వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది వరద వచ్చిన సమయాన అందరూ సమష్టిగా పనిచేయడంతో అతి తక్కువ ప్రాణ నష్టంతో బయటపడడమే కాక 15రోజుల వ్యవధిలో సాధారణ పరిస్థితికి తీసుకొచ్చామని తెలిపారు. ఈసారి కూడా మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో వర్షం వివరాలు ఎప్పటిప్పుడు తెలుసుకుంటూ, వరద వచ్చే అవకాశముంటే గ్రామం నుంచి జిల్లా వరకు వివిధ స్థాయిల్లో వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం చేరవేస్తామని చెప్పారు. అంతేకాక కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి సంబంధిత ప్రాంతాలకు సమాచారం చేరవేసి రెస్క్యూ బృందాలతో పాటు వలంటీర్లను రంగంలోకి దించాల్సి ఉంటుందని చెప్పారు. అయితే, ముందస్తుగా శిథిలావస్థకు చేరిన ఇళ్లు, ఒంటరి మహిళలు, వృద్ధులను గుర్తించాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకుబ్యాగ్‌లు పంపిణీ చేసి ముఖ్యమైన పత్రాలు, ఆభరణాలు భద్రపర్చుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆపద మిత్రలకు కలెక్టర్ సామగ్రి అందజేశారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, సీపీఓ ఏ.శ్రీనివాస్, విద్యుత్ ఎస్ఈ శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా శిక్షణ

- జిల్లా కేంద్రంలో 21 అంశాల్లో శిబిరాల నిర్వహణ
- నేటితో ముగియనున్న వేసవి శిక్షణ



క్రికెట్ సాధన చేస్తున్న బాలురు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యాన నెల రోజులుగా జరుగుతున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు శనివారం ముగియనున్నాయి. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించగానే విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా ఈ శిబిరాలు ఏర్పాటుచేశారు. దీంతో పెద్దసంఖ్యలో ఔత్సాహిక క్రీడాకారులతో స్టేడియం ఇన్నాళ్లు కళకళలాడింది. స్టేడియంలో 21 క్రీడాంశాల్లో ఇచ్చిన శిక్షణకు పెద్దసంఖ్యలో బాలబాలికలు హాజరయ్యారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, లాన్ టెన్నిస్, ఖో–ఖో, నెట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, రోలర్ స్కేటింగ్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, క్రికెట్, ఉషూ, కరాటేలో శిక్షణ్న తీసుకున్న పలువురు సెలవులు ముగిశాక కూడా శిక్షణ కొనసాగిస్తామని చెబుతుండడం విశేషం. కాగా, పెవిలియన్‌గ్రౌండ్, సెయింట్ జోసెఫ్ హైస్కూల్ మైదానాల్లో కొన్ని అంశాల్లో శిక్షణ ఇచ్చారు. శిబిరాల్లో 1,672 మంది ఔత్సాహికులు పాల్గొనగా వర్ధమాన క్రీడాకారులు మరో 300 మంది ఉంటారని అధికారులు తెలిపారు.

ఎక్కువగా బాలురే...

వివిధ క్రీడల్లో ఏర్పాటుచేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు బాలికలతో పోలిస్తే బాలురే ఎక్కువగా వచ్చారు. మొత్తంగా బాలురు 1,216 మంది హాజరు కాగా, బాలికలు 456 మంది పాల్గొన్నారు. అత్యధికంగా స్విమ్మింగ్ శిక్షణకు 580 మంది హాజరయ్యారు. అలాగే, రోలర్‌స్కేటింగ్‌కు 177 మంది బాలబాలికలు, బాస్కెట్‌బాల్‌కు 104 మంది, క్రికెట్ 100మంది, అథ్లెటిక్స్‌కు 85మంది, వాలీబాల్‌కు 80 మంది, బ్యాడ్మింటన్‌కు 80 మంది, టెన్నిస్‌కు 79 మంది హాజరు కాగా మిగిలిన క్రీడాంశాల్లో 40మందికి తగ్గకుండా పాల్గొన్నారు. గతంతో పోలిస్తే ఈసారి గణనీయంగా క్రీడాకారులు రావడంతో కోచ్‌లు ఉత్సాహంగా శిక్షణ ఇచ్చారు.

మంచి స్పందన వచ్చింది...



జిల్లా కేంద్రంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు అనూహ్యమైన స్పందన లభించింది. అనుకున్న దాని కంటే ఎక్కువ మంది హాజరయ్యారు. వీరిలో కొందరైనా నిత్యం శిక్షణ కొనసాగిస్తే మెరుగైన క్రీడాకారులు వెలుగులోకి రాడం ఖాయం. ఈ విషయమై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాం.

– టి.సునీల్‌రెడ్డి, డీవైఎస్‌ఓ

ఒకరి రిపోర్టులు ఇంకొకరికి...

సత్తుపల్లిలో స్కానింగ్ సెంటర్ నిర్వాహకం

సత్తుపల్లి: స్కానింగ్ కోసం వచ్చిన గర్భిణికి ఇంకొకరి రిపోర్టు ఇవ్వడంతో ఆ నివేదిక ఆధారంగా తీసుకున్న మందులు వాడిన ఆమె అస్వస్థతకు గురైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటకు చెందిన నందూరి అనూష ఆరు నెలల గర్భిణీ కాగా, ఈనెల 19న సత్తుపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చింది. అక్కడి వైద్యురాలు పట్టణంలోని ఓ రెస్టారెంట్ వీధిలో ఉన్న స్కానింగ్ సెంటర్‌కు పంపించింది. అయితే, నిర్వాహకులు ఆమెకు స్కానింగ్ చేశాక, తొమ్మిది నెలల గర్భిణి అయిన జ్యోతి రిపోర్టును ఇచ్చారు. ఈ నివేదిక ఆధారంగా వైద్యురాలు రాసిన మందులు వాడుతుండడంతో అనూష అస్వస్థతకు గురైంది. ఇంతలోనే స్కానింగ్ సెంటర్ బాధ్యులు ఫోన్ చేసి రిపోర్టు తారుమారుగా ఇచ్చామంటూ సమాచారం ఇవ్వగా, శుక్రవారం స్కానింగ్ సెంటర్‌కు చేరుకున్న అనూష, ఆమె భర్త, బంధువులు ఆందోళనకు దిగారు. గర్భిణీ ప్రాణాలతో చెలగాటం ఆడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి.సీతారామ్‌కు వారు ఈ సందర్భంగా ఫిర్యాదు చేశారు.

అనుమతులు లేని లేఔట్ల పరిశీలన



వెంచర్ వద్ద పరిశీలిస్తున్న టీపీబీఓ కిరణ్

సాక్షి ఎఫెక్ట్..

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా వేసిన లే ఔట్లను గుర్తిస్తున్నట్లు టీపీబీఓ కె.రాజు తెలిపారు. 'సాక్షి'లో శుక్రవారం 'రియల్' దందా..' శీర్షికన ప్రచురితమైన కథనంతో కమిషనర్ కె.నర్సింహ స్పందించారు. ఆయన ఆదేశాలతో టీపీబీఓ రాజు పలు వెంచర్లను తనిఖీ చేశారు. సత్తుపల్లిలోని అయ్యగారిపేట, కొమ్మేపల్లి కాలనీ సమీపాన రియల్ ఎస్టేట్ వెంచర్లను పరిశీలించి అనుమతులపై ఆరా తీశారు. అనుమతి లేని వెంచర్లకు సంబంధించి అధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

పోక్సో కేసు నమోదు

చింతకాని: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన వ్యక్తి శుక్రవారం వేధించాడు. ఆమెను మానసికంగా, శారీరకంగా వేధించినట్లు బాధితురాలి తల్లి ఫిర్యాదు చేయగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

కల్లూరు.. ఇకపై మున్సిపాలిటీ!

ఇన్‌చార్జ్ కమిషనర్‌గా సంపత్‌కుమార్



సంపత్‌కుమార్‌కు శుభాకాంక్షలు చెబుతున్న కార్యాలయ ఉద్యోగులు

కల్లూరు: కల్లూరు మేజర్ గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ కొన్నాళ్ల క్రితం నిర్ణయించగా రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జీఓ విడుదల చేసింది. దీంతో ఇకపై కల్లూరు మున్సిపాలిటీగా మనుగడలోకి రానుంది. అంతేకాక ఇన్‌చార్జ్ కమిషనర్‌గా మధిర మున్సిపల్ కమిషనర్ అరెగెల సంపత్‌కుమార్ నియమించగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అలాగే, స్పెషల్ ఆఫీసర్‌గా ఇల్లెందు కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్‌ను కేటాయించారు. కల్లూరును మున్సిపాలిటీ అప్‌గ్రేడ్ చేయాలని స్థానికులతో పాటు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి వినతితో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ఆమోదింపజేశారు. కప్పలబంధం, పుల్లయ్యబంజర, తూర్పు లోకవరం, పడమర లోకవరం, కిష్టయ్యబంజర, హనుమాతండా, వాచ్యానాయక్ తండాల విలీనంతో కల్లూరు మున్సిపాలిటీగా ఏర్పడింది. ఈమేరకు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సంపత్‌కుమార్‌ను పంచాయతీ ఈఓ నందిశెట్టి నాగేశ్వరరావు, ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు ఉద్యమం



కలెక్టరేట్‌కు ప్రదర్శనగా వెళ్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధిహామీ పథకానికి తగినన్ని నిధులు కేటాయించకుండా.. పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర పన్నిన నేపథ్యాన చట్టం పరిరక్షణకు ఉద్యమించాలని సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆయా సంఘాల ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నాచౌక్‌లో శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడంతో పనిదినాలు తగ్గగా గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇకనైనా నిధులు, పనిదినాల సంఖ్య పెంచడమే కాక రైతు కూలీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుగ్గవీటి సరళ, బొంతు రాంబాబు, శ్రీనివాసరావు, తాళ్లపల్లి కృష్ణ, వత్సవాయి జానకీరాములు, కొండెబోయిన నాగేశ్వరరావు, పొన్నగంటి సంగయ్య, కే.వీ.రెడ్డి, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, ఎస్.నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్స్య ఆధారిత ఉత్పత్తులతో అభివృద్ధి



మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ ప్రకాష్

కూసుమంచి: చేపల పెంపకం, అమ్మకానికే పరిమితం కాకుండా మత్స్య ఆధారిత ఉత్పత్తుల తయారీతో ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని నేషనల్ ఆగ్రో ఫౌండేషన్(చెన్నై) జాయింట్ డైరెక్టర్ పి.ప్రకాష్ తెలిపారు. పాలేరులోని మత్స్య పరిశోధనా కేంద్రంలో ఆరు జిల్లాల మహిళా మత్స్యకారులకు చేపలు, రొయ్యల ఆహార ఉత్పత్తుల తయారీపై ఇస్తున్న శిక్షణ శుక్రవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ చైనా, అమెరికా తదితర దేశాలతో పోలిస్తే మన దేశంలో చేపలతో తయారయ్యే విలువ ఆధారిత ఉత్పత్తులు తక్కువగా ఉన్నాయన్నారు. భవిష్యత్‌లో వీటికి డిమాండ్ పెరగనున్నందున మహిళా మత్స్యకారులు శిక్షణ ద్వారా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. గ్రూప్‌లుగా ఏర్పడి చేపలు, రొయ్యలతో పచ్చళ్లు, ఇతర ఉత్పత్తులు చేస్తే ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి చేయొచ్చని తెలిపారు. పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ తెలంగాణ, ఏపీ, తమిళనాడు రాష్ట్రాల కోఆర్డినేటర్ సునీల్‌కుమార్, జనగామ జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు



ఘటనాస్థలిలో లారీ, కారు, ఆటో

కొణిజర్ల: కారు, లారీ, ఆటో ఢీకొన్న ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. కొణిజర్ల ఎస్‌ఐ జి.సూరజ్ వెల్లడించిన వివరాల మేరకు... ఏపీలోని చింతలపూడి నుంచి శుక్రవారం హైదరాబాద్ వెళ్తున్న కారును తనికెళ్ల సమీపాన ఖమ్మం వైపు నుంచి వైరా వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. అంతేకాక కొణిజర్ల నుంచి ఖమ్మం వెళ్తున్న ఆటోనూ ఢీకొట్టడంతో బోల్తా పడింది. కారు డ్రైవర్ కోడూరి సునీల్, అందులో ఉన్న చింతలపూడికి చెందిన వెంకటేశ్వరరావు, పార్వతికి గాయలయ్యాయి. అలాగే, ఆటోడ్రైవర్ చింతకాని మండలం నేరడకు చెందిన తాటి లోకేష్, కొణిజర్లకు చెందిన పందిళ్ల వెంకటేశ్వర్లు, మరో వ్యక్తి గాయపడ్డారు. అయితే, ప్రమాదం జరగగానే లారీ డ్రైవర్ రోడ్డుపైనే వాహనం వదిలేసి పరారయ్యాడు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా పోలీసులు చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి రాకపోకలు క్రమబద్ధీకరించారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య

చింతకాని: మండలంలోని పొద్దుటూరుకు చెందిన తుడుం ఎల్లేష్(33) ఉరి వేసుకుని బలవన్మరణానికి బలపడ్డాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఆయన కరెంట్ వైరుతో దూలానికి ఉరి వేసుకున్నాడు. ఎల్లేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఖమ్మంలో యువతి...

ఖమ్మంక్రైం: ఖమ్మం జూబ్లీ క్లబ్ సమీపంలో నివసిస్తున్న బంక కస్తూరి(25) శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుంది. ఆమె తల్లి ఇచ్చిన సమాచారంతో ఖమ్మం త్రీటౌన్ పోలీసులు పరిశీలించారు. కస్తూరి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

రైల్వేట్రాక్ పక్కన మృతదేహం గుర్తింపు



మృతదేహాన్ని తరలిస్తున్న అన్నం ఫౌండేషన్ బాధ్యులు

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఏ) రైల్వేట్రాక్ సమీపాన ఓ యువకుడి మృతదేహాన్ని గుర్తించారు. పదిహేను రోజుల క్రితం సదరు యువకుడు రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు తెలుస్తుండగా దుర్వాసన వస్తుండడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం ఆధారంగా రైల్వే పోలీసులు శుక్రవారం పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోగా, ఆ పక్కనే లభించిన సెల్‌ఫోన్‌లో ఉన్న నంబర్లకు ఫోన్ చేయడంతో మృతుడు ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం సీతారాంపురం వాసి నేతుల అనిల్‌బాబు(20)గా తేలింది. ఈ మేరకు కుటుంబీకులకు సమాచారం ఇచ్చినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. కాగా, మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు సాయంతో ఖమ్మం మార్చురీకి తరలించారు.

గుండెపోటుతో రైతు మృతి



వెంకటేష్ (ఫైల్)

కారేపల్లి: పంటల సాగు పనుల్లో నిమగ్నమైన రైతు గుండెపోటుతో మృతి చెందిన ఘటన కామేపల్లి మండలం మంగళితండా గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు పిల్లలమర్రి వెంకటేష్(30) రెండున్నర ఎకరాల్లో మిర్చి, మొక్కజొన్న, వరి సాగుకు ఏర్పాట్లుచేసుకుంటున్నాడు. ఈక్రమాన శుక్రవారం ఉదయం తెల్లవారుజామున ఛాతిలో నొప్పి వస్తోందని చెప్పగా గుండెపోటుగా గుర్తించిన కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుండగానే మృతి చెందాడు. ఆయనకు భార్య ఉమ, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

చింతకాని: అనారోగ్య సమస్యలతో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని తిమ్మినేనిపాలెంకు చెందిన తుడం రవి(55) కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఈనేపథ్యాన ఆయన భార్య పొలం పనులకు వెళ్లిన సమయాన గురువారం పురుగుల మందు తాగాడు. కొద్దిసేపటికి గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.

● స్మరణ



కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లో జరిగిన సభలో గూగీ

ఆ అక్షరం అమ్మ గోరుముద్ద

స్త్రీ హృదయం, ఉద్యమం తెలిసిన మహా రచయిత గూగీ వా థియాంగో. గూగీని అక్షర ప్రపంచంలోకి తీసుకువచ్చింది... మహిళ. అతడి అక్షర బలానికి ఇంధనం... మహిళా చైతన్యం...



అమ్మ లేకపోతే 'గూగీ' ప్రపంచ సాహిత్యానికి పరిచయం కాకపోయేవారేమో! 'నాయనా... నాకు అక్షరం ముక్క రాదు. ఏంచేస్తావో, ఎలా చేస్తావో... నువ్వు మాత్రం బాగా చదువుకోవాలి' అని ఎప్పుడూ అంటూ ఉండేది. 'అమ్మ కోరుకున్నట్లే బాగా చదువుకున్నాను. మంచి స్థితిలో ఉన్నాను' అని సంతృప్తి పడి ఆకాశం వైపు మాత్రమే చూస్తూ కూర్చోలేదు గూగీ. వెనక్కి తిరిగి చూశారు.

'నాయనా... నువ్వు ఇంకా చదువుకోవాలి' అని అమ్మ అడిగినట్లు అనిపించింది. ఈసారి విశ్వవిద్యాలయం చదువులు కాదు తన కెన్యా జాతిజనుల జీవితాలను లోతుగా, మరింత లోతుగా చదివారు. కలానికి పదును పెట్టారు. మూలాలు మరవని గూగీ ప్రపంచ ప్రసిద్ధ రచయిత అయ్యారు.

అమ్మ నా హీరో

'నా హీరోలు ఇద్దరు. ఒకరు జోమో కెన్యట్ట. రెండో వ్యక్తి వాన్‌జీకూ' అనేవారు గూగీ. కెన్యన్ ప్రజల కోసం పోరాడిన యోధుడు జోమో కెన్యట్ట. రెండో వ్యక్తి గూగీ అమ్మ. వాన్‌జీకూ ప్రసిద్ధ ఉద్యమ నాయకురాలు కాకపోవచ్చు. అయితే ఉద్యమ చైతన్యం ఆమె వ్యక్తిత్వంలో మెరిసిపోయేది. ఆమె విద్యాధికురాలు కాకపోవచ్చు. అయితే ఆమె మాటల్లో, విశ్లేషణల్లో మేధస్సు కనిపించేది. ఆమెకు అక్షరం ముక్క కూడా తెలియదు. అయితే అక్షరం విలువ తెలుసు.

'మా అమ్మకు చదవడం, రాయడం రాదు. అయితే నేను బాగా చదువుకోవాలని కోరుకునేది. బాగా చదువుకోవాలనే తన కలను నా ద్వారా నిజం చేసుకోవాలనుకునేది' అంటారు గూగీ. గూగీ నాన్నకు నలుగురు భార్యలు. 28 మంది పిల్లలు. వాన్‌జీకూ (గూగీ అమ్మ) మూడో భార్య. తనది రాజ్యహింస బాధిత కుటుంబం అనవచ్చు.

'కెన్యా ల్యాండ్ అండ్ ఫ్రీడమ్ ఆర్మీ'లో పనిచేస్తున్న ఒక సోదరుడు, స్టేట్ ఎమర్జెన్సీ సమయంలో మరో సోదరుడు హత్యకు గురయ్యారు. హోమ్ గార్డ్‌లు(కికుయూ హోంగార్డ్) చేతిలో తల్లి చిత్రహింసలకు గురైంది. గూగీ తొలి నవల 'వీప్, నాట్ చైల్డ్'లో అమ్మ కనిపిస్తుంది. ఇందులో కథానాయకుడి కల... ఎలాంటి పరిస్థితుల్లో అయిన బాగా చదువుకోవాలని. ఎందుకంటే అది తన తల్లి కల.

చిన్న వాళ్లు అయినా... పెద్ద మనసుతో...

'నేను ప్రసిద్ధ రచయితను' అనే అహం గూగీలో కనిపించేది కాదు. తన కంటే వయసులో చాలా చిన్న వాళ్ల నుంచి అయినా నేర్చుకునే, ఆలోచన తీరును మార్చుకునే, అభినందించే మంచి పద్ధతి గూగీలో ఉంది. దీనికి ఉదాహరణ నైజీరియన్ రచయిత్రి చిమమాండా అదిచే. 1977లో పుట్టింది. నాలుగు నవలలు, రెండు చిన్న కథా సంకలనాలు, వ్యాసాల పుస్తకాలు తీసుకువచ్చింది.

ఆమె నవలల్లో ఒకటైన 'హాఫ్ ఆఫ్ ఏ యెల్లో సన్' గూగీకి ఇష్టమైన నవల. నైజీరియన్ అంతర్యుద్ధానికి సంబంధించి తండ్రి చెప్పిన విషయాల ఆధారంగా ఈ నవల రాసింది. 'ఆమె నవలలోని పాత్రల గురించి ఆలోచించకుండా బియాఫ్రాన్ యుద్ధం గురించి ఎప్పుడూ ఆలోచించలేదు' అంటారు గూగీ. అమెరికన్ న్యూస్ టెలివిజన్ ప్రోగ్రాం....రేచల్ మాదో షో(టీఆర్ఎంఎస్). రేచల్ మాదో నిర్వహించే ఈ ప్రోగ్రాం అంటే గూగీకి చాలా ఇష్టం. 'డ్రిఫ్ట్: ది అన్ మోర్నింగ్ ఆఫ్ అమెరికన్ మిలిటరీ పవర్' 'బ్లోఅవుట్: కరప్టెడ్ డెమోక్రసీ' 'బ్యాగ్‌మ్యాన్: ది వైల్డ్‌క్రైమ్స్' 'ప్రీక్వెల్: యాన్ అమెరికన్ ఫైట్ అగేనెస్ట్ ఫాసిజం' పుస్తకాలు రాసింది రేచల్.

'ఎంతటి జటిలమైన విషయాలను అయినా సులభంగా అర్థమయ్యేలా చెప్పడంలో రేచల్ దిట్ట. ఆమె అద్భుతమైన కథకురాలు. రేచల్ ప్రోగ్రామ్‌లో కనిపించాలనేది నా కల' అన్నారు గూగీ.

ఆమె సలహా ఎప్పుడూ గుర్తుపెట్టుకునేవారు

గ్రామీణుల మాటల్లో విలువైన జీవిత సత్యాలు, అనుసరించదగిన మాటలు ఉంటాయి. అందుకే వారి మాటలు వినడం అంటే గూగీకి ఇష్టం. కెన్యాలో మహిళా రైతు అయిన నెరి వాచాంగ ఇలా అన్నది... 'మరో అయిదు పనులు నీ మీద పడకముందే నీ ముందు ఉన్న అయిదు పనులు పూర్తి చెయ్యి. అలా కాకుండా ఒకేసారి పది పనులు చేయడం ఎంత భారం!' 'వాచాంగ ఇచ్చిన సలహాను పాటిస్తుంటాను. పాటిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. పాటించకపోతేనే ఇబ్బంది' అంటుండేవారు గూగీ.

ఉద్యమ మహిళల గొంతుక

అద్భుత చైతన్యం ఉన్న ఎన్నో తరాల మహిళలను ప్రత్యక్షంగా చూశారు గూగీ. అందుకే ఆయన రచనల్లో పోరాట పటిమ ఉన్న మహిళలు, సామాజిక, రాజకీయ మార్పు కోసం చేసే ఉద్యమాలలో క్రియాశీల పాత్ర పోషించే మహిళలు, పురుషాధిపత్యాన్ని కాలదన్ని తమదైన మార్గంలో నడిచి స్ఫూర్తినిచ్చే మహిళలు ఉంటారు. స్త్రీలపై సాగే దోపిడి, అణచితవేతను అక్షర బద్ధం చేశారు గూగీ. కష్టాలు, కన్నీళ్లు మహిళలను ఉద్యమపథంలోకి వెళ్లకుండా అడ్డుపడలేవని తన నవలల ద్వారా చెప్పారు గూగీ.

బులియన్

30న ముగింపు రూ.లలో (బంగారం 10 గ్రా. : వెండి కిలో)

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

హైదరాబాద్		**రాజమండ్రి**	
బంగారం (24 క్యారెట్లు)	96,110	బంగారం (24 క్యారెట్లు)	98,140
బంగారం (22 క్యారెట్లు)	89,430	బంగారం (22 క్యారెట్లు)	91,880
వెండి	99,000	వెండి	99,500
విజయవాడ		**ప్రొద్దుటూరు**	
బంగారం (24 క్యారెట్లు)	98,140	బంగారం (24 క్యారెట్లు)	95,600
బంగారం (22 క్యారెట్లు)	89,200	బంగారం (22 క్యారెట్లు)	87,950
వెండి	99,500	వెండి	98,700
విశాఖపట్నం		**చెన్నై**	
బంగారం (24 క్యారెట్లు)	97,310	బంగారం (24 క్యారెట్లు)	97,300
బంగారం (22 క్యారెట్లు)	89,200	బంగారం (22 క్యారెట్లు)	89,200
వెండి	1,10,900	వెండి	1,11,000

మిస్ వరల్డ్ 2025



నేడు ఫినాలే
బ్యూటీ కిరీటం ఎవరికి?

అందం అంటే ఆత్మవిశ్వాసం..
అందం అంటే ఓ సామాజిక బాధ్యత..
అందం అంటే సాధికారత..
అందం అంటే ఎమోషనల్ బ్యాలెన్స్, ఫిజికల్ ఫిట్‌నెస్..

అనే అందమైన నిర్వచనాలను స్థిరపరుస్తూ సాగుతున్న మిస్ వరల్డ్ పోటీలకు ఈసారి హైదరాబాద్ వేదికైంది! ఈ పోటీలు ఫైనల్‌కి వచ్చాయి.

మిస్ వరల్డ్ కిరీటం ఎవరికి దక్కనుందో తేలేది నేడే! నూటఎనిమిది దేశాలకు చెందిన సుందరీమణులు పోటీ పడుతున్న ఆ బ్యూటీ పాజెంట్ ఫైనల్ ఎలా ఉండబోతోంది, మిస్ వరల్డ్‌గా ఎంపికైన సుందరి ఏడాదంతా ఏం చేస్తుంది లాంటివి ఆసక్తిని రేకెత్తిస్తాయి.



మిస్ వరల్డ్ పోటీకి విచ్చేసిన వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు

హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో సాయంత్రం ఆరున్నరకు మొదలవనున్న మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే వేడుకను మిస్ వరల్డ్ 2016 స్టెఫనీ డెల్ బాయే (Stephanie del valle), యాంకర్, వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్ సచిన్ కుంభార్.. ఇద్దరూ కలిసి హోస్ట్ చేస్తున్నారు.

ఎంపిక ఇలా..

ముందుగా 108 దేశాల సుందరీమణులు వేదిక మీదికి వస్తారు. అమెరికా– కరిబియన్, ఆఫ్రికా, యూరప్, ఆసియా– ఓషియానియాల నుంచి ఖండానికి పది మంది చొప్పున మొత్తం నలభై మందిని క్వార్టర్ ఫైనల్‌కి సెలెక్ట్ చేస్తారు. అయితే ఇప్పటికే రకరకాల పోటీల్లో ఈ నాలుగు ఖండాల నుంచి పద్దెనిమిది మంది క్వార్టర్ ఫైనల్‌కి చేరుకున్నారు. మిగిలినవారిని పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా సెలెక్ట్ చేసిన జ్యూరీ ఈ రోజు వాళ్ల పేర్లను ప్రకటించి వేదిక మీదికి ఆహ్వానిస్తుంది. ఈ నలభై మంది లోంచి ప్రతి ఖండానికి టాప్ ఫైవ్ చొప్పున, మళ్లీ అందులోంచి ప్రతి ఖండానికి టాప్ 2 లెక్కన సెలెక్ట్ చేస్తారు.



● ఐశ్వర్యా రాయ్



● ప్రియాంకా చోప్రా



● రీటా ఫారియా



● హెలెన్ మోర్గన్

ఫైనల్‌గా..

ఫైనల్‌రౌండ్ వచ్చేసరికి మొత్తం నలుగురు మాత్రమే మిగులుతారు. ఈ నలుగురిని జ్యూరీ ఓ ప్రశ్న అడుగుతుంది. ఆ జవాబును బట్టి మిస్ వరల్డ్‌ను ఎంపిక చేస్తారు. విజేతకు కిందటేడు మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా అందాల కిరీటాన్ని తొడుగుతుంది. జ్యూరీలో నటుడు సోనూ సూద్, సుధారెడ్డి, మిస్ ఇంగ్లండ్ 2014 డాక్టర్ కెరీనా టరెల్, మిస్ వరల్డ్ చైర్‌పర్సన్ జూలియా మోర్లే సభ్యులుగా ఉంటారు.

గెలిచిన తర్వాత..

మిస్ వరల్డ్ టైటిల్ విజేత తన దేశం తరపున ప్రపంచవ్యాప్త సాంస్కృతిక కార్యక్రమాలు, అధికారిక వేడుకలు, సంబరాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. పలు చారిటీ ప్రోగ్రామ్స్, ప్రాజెక్ట్స్‌లో పాల్గొంటుంది. మిస్ వరల్డ్ సంస్థ తరపున ప్రపంచ యాత్ర చేస్తూ ఆ సంస్థ లక్ష్యాలను ప్రచారం చేస్తుంది. అక్షరాస్యత, పలు సామాజిక అంశాల అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటుంది.

ఇంకా...

● మిస్ వరల్డ్ విజేతకు తొడిగే అందాల కిరీటం ధర రూ. 85 లక్షల పైచిలుకే! 18 క్యారట్ల గోల్డ్‌తో చేసిన ఆ కిరీటం మధ్యలో 62.83 క్యారట్ల డైమండ్ చుట్టూ 1770 చిన్న చిన్న డైమండ్స్ పొదిగి ఉంటాయి. వాటన్నిటి బరువు 175.49 క్యారట్లుంటాయి. దీన్ని ఆ విజేత ముఖ్యమైన ఈవెంట్స్‌లో మాత్రమే ధరిస్తుంది. ప్రపంచ యాత్రలో అసలైన కిరీటాన్ని పెట్టుకోదు. మిస్ వరల్డ్ విజయానికి చిహ్నంగా విజేతకు రెప్లికా క్రౌన్‌ను ఇస్తారు. అసలు కిరీటం మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ దగ్గరే ఉంటుంది. ఈ పోటీలకు వయోపరిమితి 17 ఏళ్ల నుంచి 27 ఏళ్లు.

● టర్మ్ అవకముందే మిస్ వరల్డ్ హోదాకు రాజీనామా చేసిన తొలి మిస్ వరల్డ్ 1974 సంవత్సర విజేత హెలెన్ మోర్గన్. టైటిల్ గెలిచిన నాలుగు రోజులకు ఆమె ఏడాదిన్నర బిడ్డకు తల్లి అని తెలిసిందట. మిస్ వరల్డ్ పోటీల్లో అవివాహితలు మాత్రమే పాల్గొనాలనే నియమాన్ని ఉల్లంఘించినందువల్ల ఆమె రాజీనామా చేయాల్సి వచ్చింది.

● అమెరికా – వియత్నాం యుద్ధంలో అప్పటి మన ప్రభుత్వం వియత్నాం పక్షాన నిలబడింది. దీనికి విరుద్ధంగా మన తొలి మిస్ వరల్డ్ రీటా ఫారియా అమెరికన్ ఎంటర్‌టైనర్ బాబ్ హోప్‌తో కలిసి అమెరికా సైనికులను ఎంటర్‌టైన్ చేసిందని ఆమె చర్య పట్ల అప్పుడు మన ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది.

● మిస్ వరల్డ్ పోటీలు మొదలైన నాటి (1951) నుంచి ఈరోజు దాకా మన దేశం ఆరుసార్లు కిరీటాన్ని గెలిచి రికార్డ్ సృష్టించింది.



● డయానా హెడెన్

● విజేతల్లో ఐశ్వర్యా రాయ్‌ను మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ మోస్ట్ సక్సెస్‌ఫుల్ మిస్ వరల్డ్‌గా చెబుతుంటారు.

● ఫెయిర్‌నెస్ క్రీమ్ ప్రకటనలకు నో చెప్పిన తొలి మిస్ వరల్డ్‌గా డయానా హెడెన్ (మిస్ వరల్డ్ 1997)ను ప్రస్తావిస్తారు. 'నా ఒంటి రంగు పట్ల నాకెలాంటి రిగ్రెట్స్ లేవు. ఛాయ తక్కువగా ఉండటాన్ని నేను ఆత్మన్యూనతగా ఎప్పుడూ భావించలేదు. ఆ స్కిన్‌టోన్‌తోనే నేను మిస్ వరల్డ్‌గా గెలిచాను. నా దృష్టిలో ఆత్మవిశ్వాసమే అసలైన అందం. కాబట్టి దాన్నే ప్రమోట్ చేస్తాను ఫెయిర్‌నెస్ క్రీమ్స్‌ని కాదు' అని చెప్పింది డయానా.

● అందాల పోటీల్లో చమత్కారం, సునిశిత దృష్టి గల జవాబులకు ప్రియాంక చోప్రా పెట్టింది పేరుగా ఖ్యాతినార్జించింది.

– సరస్వతి రమ

ఫొటో: ఎస్.ఎస్. ఠాకూర్

● కిచెన్ టిప్స్



మిగిలిపోయిన చపాతీ, బ్రెడ్‌స్లైసులు గట్టిగా అయిపోయి తినడానికి పనికిరావు. వీటిని ప్లేటులో పెట్టి, ఈ ప్లేటులోనే అరగ్లాసు నీటిని కూడా ఉంచి, మైక్రోవేవ్‌లో పదినిమిషాలు ఉంచాలి. ఇలా చేయడం వల్ల నీళ్లు ఆవిరిగా మారి చపాతి, బ్రెడ్‌స్లైసులు మెత్తబడి, అప్పుడే చేసినవాటిలా తాజాగా ఉండి, తినడానికి పనికొస్తాయి.



● వేపుడు కూరలు వండేటప్పుడు టీస్పూను వెనిగర్ వేస్తే కూర అంతగా నూనె పీల్చుకోదు.

● సన్నని మంట మీద యాపిల్ తొక్కలు మరిగించిన నీటితో అల్యూమినియం పాత్రలను తోమితే మొండి మరకలు ఇట్టే పోతాయి.

వంటిల్లు

ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పుట్టగొడుగులతో కేవలం కూరలే కాకుండా, రుచికరమైన చిరుతిళ్లు కూడా చేసుకోవచ్చు. నిజానికి మాంసాహారం తినని వారికి ఇవి చక్కటి ప్రత్యామ్నాయం అంటుంటారు చాలామంది. అలాంటి మష్రూమ్‌తో ఈ టేస్టీ స్నాక్స్ మీకోసం...


మష్రూమ్ మేనియా



మష్రూమ్ బజ్జీ

కావలసినవి: మష్రూమ్స్ – ఒక కప్పు (శుభ్రం చేసుకుని పెట్టుకోవాలి); శనగపిండి – ఒక కప్పు; బియ్యప్పిండి – 2 టేబుల్ స్పూన్లు; మసాలా, అల్లం వెల్లుల్లి పేస్ట్ – ఒక టీ స్పూన్ చొప్పున; కారం, పసుపు, వాము పొడి, ఉప్పు – కొద్దికొద్దిగా; నీరు, నూనె – సరిపడా; వంట సోడా – కొద్దిగా.

తయారీ: ముందుగా శనగపిండి, బియ్యప్పిండి, అల్లం –వెల్లుల్లి పేస్ట్, కారం, పసుపు, వాము పొడి, ఉప్పు, వంట సోడా వేసుకుని, తగినంత నీళ్లు పోసుకుంటూ బజ్జీల పిండిలా చిక్కగా కలుపుకోవాలి. అనంతరం ఒక్కో పుట్టగొడుగును శనగపిండి మిశ్రమంలో ముంచి నూనెలో డీప్ ఫ్రై చేసుకోవాలి. వేడివేడిగా తింటే భలే రుచిగా ఉంటాయి ఇవి.



మష్రూమ్ పిజ్జాలు

కావలసినవి: పెద్ద పోర్ట బెల్లా పుట్టగొడుగులు– 4 (లోపలి భాగం తొలగించి గుంతలా చేసుకోవాలి); టమాటో సాస్ – 3 టేబుల్ స్పూన్స్; మొజారెల్లా చీజ్ తురుము – అర కప్పు; ఆలివ్ ఆయిల్ – ఒక టేబుల్ స్పూన్; వెల్లుల్లి రెబ్బలు – 2 రెబ్బలు (సన్నగా తరిగినవి); ఉల్లిపాయ ముక్కలు, క్యాప్సికమ్ ముక్కలు, మొక్కజొన్న గింజలు, చిల్లీ ఫ్లేక్స్, పుదీనా తురుము, టమాటో ముక్కలు – కొద్దికొద్దిగా (అభిరుచిని బట్టి); ఉప్పు – సరిపడా; మిరియాల పొడి – చిటికెడు.

తయారీ: ముందుగా ఓవెన్‌ను 200 డిగ్రీల సెల్సియస్‌లో ప్రీహీట్ చేసి పెట్టుకోవాలి. పుట్టగొడుగులకు అన్నివైపులా కొద్దిగా ఆలివ్ ఆయిల్ రాసి, బేకింగ్ ట్రేలో ఉంచి, 5 లేదా 7 నిమిషాలు బేక్ చేసి, బయటికి తీసుకోవాలి. ఇప్పుడు ఆ పుట్టగొడుగుల లోపల పిజ్జా సాస్ రాసి, వాటిలో మొజారెల్లా చీజ్‌తో పాటు ఉల్లిపాయ ముక్కలు, టమాటో ముక్కలు, క్యాప్సికమ్ ముక్కలు, స్వీట్ కార్న్ (వీటితో పాటు అదనంగా నచ్చినవి జోడించుకోవచ్చు) వంటివి వేసుకోవాలి. మళ్ళీ ఓవెన్‌లో పెట్టి, చీజ్ కరిగే వరకూ బేక్ చేసుకుని, వేడి వేడిగా సర్వ్ చేసుకోవచ్చు.



మష్రూమ్ కట్లెట్స్

కావలసినవి: పుట్టగొడుగులు – 200 గ్రాములు; బంగాళాదుంపలు – 4 చిన్నవి (ఉడికించి, తొక్క తీసి మెత్తగా గుజ్జులా చేసుకోవాలి); ఉల్లిపాయ – ఒకటి (చిన్నగా తరగాలి); నూనె – సరిపడా; పచ్చిమిర్చి – ఒకటి (సన్నగా తరగాలి); కొత్తిమీర పొడి – ఒక టేబుల్ స్పూన్; ఇంగువ, పసుపు – అర టీస్పూన్ చొప్పున; జీలకర్ర పొడి – ఒక టేబుల్ స్పూన్; గరం మసాలా పొడి – అర టేబుల్ స్పూన్; కొత్తిమీర తరుగు – అర కప్పు; శనగ పిండి – 3 టేబుల్ స్పూన్లు; పాలు – 2 టేబుల్ స్పూన్లు; గుడ్డు – ఒకటి; బ్రెడ్ పౌడర్ – కొద్దిగా; ఉప్పు – తగినంత.

తయారీ: ముందుగా పుట్టగొడుగులను శుభ్రం చేసి, తడిలేకుండా తుడిచి, చిన్న ముక్కలుగా కట్ చేసుకుని నూనెలో డీప్ ఫ్రై చేసుకుని పక్కనపెట్టుకోవాలి. అనంతరం పాన్‌లో నూనె వేడి చేసుకుని ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేయించుకోవాలి. తర్వాత ఇంగువ, పుట్టగొడుగు ముక్కలు, పసుపు, కొత్తిమీర తరుగు, గరం మసాలా, జీలకర్ర పొడి వేసి 2–3 నిమిషాలు ఉడికించి, చల్లారనివ్వాలి. ఇప్పుడు ఆ మిశ్రమంలో బంగాళదుంప గుజ్జు, శనగపిండి, ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి బాగా కలపాలి. ఇప్పుడు చిన్న చిన్న ఉండలుగా చేసుకుని నచ్చిన షేప్‌లో కట్లెట్స్‌లా ఒత్తుకోవాలి. ఇప్పుడు ఒక చిన్న పాత్రలో గుడ్డు, పాలు వేసి బాగా కలిపి, దానిలో ఈ కట్లెట్స్ ముంచి, బ్రెడ్ పౌడర్ పట్టించి, వాటిని నూనెలో దోరగా వేయించుకుంటే సరిపోతుంది. వీటిని టమాటో సాస్‌లో ముంచి తింటే భలే రుచిగా ఉంటాయి.

– సన

● నయా వంచన

అయ్ బాబోయ్... ఏఐ వాయిస్ క్లోనింగ్!



ఆరోజు... ముంబైలో ఉండే కేశవ్‌కు ఫోన్‌కాల్ వచ్చింది. దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయం నుంచి కాల్ చేస్తున్నట్లు చెప్పారు. కొన్ని సెకన్ల తరువాత... ఫోన్‌లో తన కుమారుడు శ్రీకర్ అరుపులు విని కేశవ్ షాక్ అయ్యాడు. 'దయచేసి నాకు బెయిల్ ఇప్పించండి' ఏడుస్తూనే అంటున్నాడు శ్రీకర్. 'మీరు 80,000 రూపాయలు చెల్లించాలి' అని ఫోన్ చేసిన వాళ్లు కేశవ్‌ను డిమాండ్ చేశారు. ఆ భయంలో, బాధలో ఏమీ తోచని కేశవ్ వారు చెప్పినట్లే చేశాడు. అయితే అది మోసం అని తెలుసుకోవడానికి కేశవ్‌కు ఎంతో టైమ్ పట్టలేదు. తన కుమారుడు సురక్షితంగానే ఉన్నాడు.

మరి వాయిస్ మాటేమిటి?

శ్రీకర్ వాయిస్‌ను అనుసరిస్తూ ఏఐ ద్వారా సృష్టించిన ఫేక్ వాయిస్ అది. సైబర్ మోసాలలో ఒకటి... ఏఐ వాయిస్ క్లోనింగ్. ప్రజల భావోద్వేగాలను, బలహీనతలను ఆసరాగా చేసుకొని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో మోసం చేస్తున్నారు స్కామర్స్. గత కొంతకాలంగా 'వాయిస్ క్లోనింగ్' ఊపందుకుంది. అయితే విద్యావంతులు, విద్యావంతులు కాని వారు అనే తేడా లేకుండా డెబ్బైశాతం మంది క్లోన్ వాయిస్‌లను గుర్తించలేపోతున్నారు. ఒక వ్యక్తి వాయిస్‌ను క్లోన్ చేయడానికి స్కామర్‌లకు జస్ట్ మూడు సెకన్ల సమయం చాలు.

మోసగాళ్ల బారిన పడకుండా కొన్నిచిట్కాలు

'అయ్యో... నన్ను గుర్తుపట్టలేదా!' అంటూ మోసగాళ్లు మాటలు కలుపుతారు.

'సారీ... గుర్తుపట్టలేదు' అంటే ఏమనుకుంటారో అని మొహమాటం కొద్దీ మాట్లాడడం మొదలుపెడతారు కొందరు. అలా చేస్తే మోసగాళ్లకు అవకాశం ఇచ్చినట్లే.

అందుకే... 'నేను ఫలానా...' అని అవతలి వ్యక్తి చెప్పినప్పుడు మీ ఇద్దరికి మాత్రమే తెలిసిన ఒక విషయం గురించి అడగండి. అతను కరెక్ట్ అని చెబితే ఓకే. కానిపక్షంలో అనుమానించాల్సిందే.

● స్నేహితుడు, బంధువు... మొదలైన వారి పేరుతో వచ్చిన కాల్ చాలా తక్కువ టైమ్ మాత్రమే ఉంటే అది వార్నింగ్ సైన్ అనుకోవచ్చు.

● ఏఐ స్కామ్ వాయిస్‌లు తెలియని నంబర్ నుంచి జరుగుతుంటాయి.

● ఆన్‌లైన్‌లో అపరిచితులకు వాయిస్ నోట్స్, వీడియో షేరింగ్ చేయకూడదు.